సాక్షి


డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 4 । జూలై । 2023



బాలుడిని బలిగొన్న ఆర్టీసీ బస్సు

అతి వేగం కారణంగా ఏడేళ్ల బాలుడు అసువులు బాశాడు. తమ బిడ్డ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం రోదన వర్ణనాతీతంగా మారింది. - IIలో ▸



డెల్టాలకు 8,105 క్యూసెక్కులు

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 2,250, మధ్య డెల్టాకు 1,615, పశ్చిమ డెల్టాకు 4,240 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టారు.

గరిష్టం/కనిష్టం
44.0° / 28.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	44.0	29.0
కాకినాడ	39.0	28.5
అమలాపురం	40.5	29.0

సురక్షలో తక్షణ పరిష్కారాలు



అమలాపురం మండలం బండారులంకలో మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రాష్ట్ర రవాణా శాఖమంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందెర శ్రీహరి



కాజులూరు మండలంల ఆర్యావటంలో లబ్ధిదారుకు కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ తదితరులు

- క్యాంపుల వద్దనే లబ్ధిదారులకు సరిఫికెట్లు అందజేత
- 22 మండలాలు, నాలుగు అర్బన్ ప్రాంతాల్లో జోరుగా నిర్వహణ



సాక్షి అమలాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలు రకాల కార్యక్రమాలను ప్రవేశ పెట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం... తాజాగా పెట్టిన జగనన్న సురక్షను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. జగనన్నకు చెబుదాం... గడప గడపకూ మన ప్రభుత్వం... ప్రతీ సోమవారం జరిగే స్పందన... వీటిలో కూడా పరిష్కారం కాని పలు సమస్యలకు జగనన్న సురక్షలో పరిష్కారం దొరుకుతున్నాయి. జిల్లాలోని 22 మండలాలు, నాలుగు అర్బన్ ప్రాంతాల్లో ఎంపిక చేసిన ప్రాంతాలలో నిర్వహిస్తున్న జగనన్న సురక్షలో రెండో రోజు సోమవారం జిల్లావ్యాప్తంగా 23 క్యాంప్‌లను నిర్వహించారు. తొలి రోజు జూలై ఒకటో తేదీన 47 క్యాంపులకు 70 క్యాంపులను విజయవంతంగా నిర్వహించారు. ఆయా క్యాంపులకు జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా శాఖమంత్రి పినిపే విశ్వరూప్, బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణలతో కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. కలెక్టర్ శుక్లా, జేసీ ధ్యానచంద్రతో పాటు జిల్లాకు చెందిన ఆయా శాఖల ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నారు. జగనన్న సురక్ష క్యాంపులలో పదకొండు రకాల సేవలను ఉచితంగా అందజేస్తున్నారు. అక్కడికక్కడే కుల, ఆదాయ, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కు మొబైల్ నంబరు అనుసంధానం, మూటేషన్ లావాదేవీలు, ఫ్యామిలీ మెంబర్ల సర్టిఫికెట్, పంట సాగు హక్కు పత్రం, కొత్త రేషన్ కార్డులు, హౌస్ హోల్డింగ్ మ్యాప్ వంటి పదకొండు రకాల సేవలకు ధ్రువీకరణ పత్రాలు అందుతున్నాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 515 క్యాంపులను నిర్వహించనున్నారు. జగనన్న సురక్షలో 1,26,736 సమస్యలకు సంబంధించి టోకెన్లు నమోదు కాగా, వీటిలో 1,09,039 సమస్యలను అధికారులు గుర్తించారు. ఎక్కువగా కుల, ఆదాయ, భూములకు సంబంధించి సమస్యలు వస్తున్నాయి. వీటిని అధికారులు తక్షణం పరిష్కరిస్తున్నారు.

చిటికెలో..



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు సిద్దాల చినవీర్రాజు. రాయవరం మండలం కూర్మాపురం గ్రామానికి చెందిన వాడు. ఉపాధి హామీ పథకంలో పని కల్పించాల్సిందిగా దరఖాస్తు చేశాడు. వెంటనే ఉపాధి హామీ పథకంలో అధికారులు పని కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. అధికారుల చొరవతో చిటికెలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని చినవీర్రాజు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపాడు.

కార్యాలయాల చుట్టూ తిరగకుండానే సర్టిఫికెట్లు ఇచ్చారు



గతంలో కుల, ఆదాయ సర్టిఫికెట్‌ల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరక్కుండానే, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అధికారులు ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది.

– పెయ్యల కొండబాబు, ఇంజరం, తాళ్లరేవు మండలం

గతంలో ఎన్నో ఇబ్బందులకు గురయ్యాం



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఒకే రోజు వచ్చాయి. గతంలో ఆఫీసులకు వెళ్లేవాళ్లం. రెండింటికీ రూ.50 తీసుకునేవారు. ఇప్పుడు ఉచితంగా సొంత గ్రామంలో అందించారు. సంతోషంగా ఉంది.

– బత్తుల కుమారి, నగరం, మమిడికుదురు మండలం.

అందరికీ సంక్షేమం

కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, కార్యక్రమాలను ప్రవేశపెట్టి ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతోందని చెప్పారు. సోమవారం కలెక్టరేట్ స్పందన హాల్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి సుమారుగా 236 దరఖాస్తులను కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు స్వీకరించారు. మండల స్థాయి సమస్యలు వచ్చిన సందర్భంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత మండల అధికారితో నేరుగా జిల్లా కలెక్టర్ సంప్రదించి ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వైద్యశాల సమన్వయ అధికారి పద్మశ్రీ,రాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, డీఆర్‌డీఏ పీడీ వి.శివ శంకర్ ప్రసాద్, సీపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు కె.చంటిబాబు, సీహెచ్ ఎన్వీ కృష్ణారెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్‌ఈ బి.రాము, ఐసీడీఎస్ పీడీ జీవీ సత్యవాణి, బీసీ వెల్ఫేర్ అధికారి తిక్కా వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ పాల్గొన్నారు.



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ శుక్లా

పోలీసు స్పందనకు 29 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక – స్పందన కార్యక్రమానికి 29 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషాలు ఈ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. 29 అర్జీల్లో కొన్ని భూతగాదాలు, కుటుంబ వివాదాలకు సంబంధించినవి కావడంతో అర్జీదారులు ఎస్పీ కార్యాలయానికి కుటుంబ సభ్యులతో వచ్చారు. వచ్చిన అర్జీల్లో కొన్నింటిని ఎస్పీ శ్రీధర్ అక్కడికక్కడే పరిష్కరిస్తూ చర్యలు చేపట్టారు. స్పందన కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ కోలా రజనీకుమార్, డీసీఆర్‌బీ ఎస్సై గంగాభవాని పాల్గొన్నారు.

త్వరలో అమలాపురానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైంది. మూడు దశాబ్దాలుగా అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఇక్కడ ప్రజాప్రతినిధులు, పూర్వపు విద్యార్థులు చేస్తున్న విజ్ఞప్తులు కార్యరూపం దాల్చుతున్నాయి. డిగ్రీ కళాశాలలను పర్యవేక్షించే రాజమహేంద్రవరం ఆర్జేడీ కార్యాలయానికి బృందం నెలరోజుల కిందట అమలాపురంలో ఏర్పాటు చేయబోయే డిగ్రీ కళాశాలలకు అనువైన భవనం కోసం అన్వేషించింది. ఇప్పటికే అమలాపురం వెత్సావారి అగ్రహారంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల పై అంతస్తులో కొన్ని గదులను డిగ్రీ కళాశాల కోసం పరిశీలించారు. దాదాపు ఈ కళాశాలలోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు నిర్ణయం జరిగినప్పటికీ అమలాపురంలో ఇంకా ఏమైనా అనువైన భవనాలు ఉన్నాయా..? అనే దిశగా కూడా ఈ బృందం అన్వేషించింది. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఒక భవనాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం తీసుకుంటే ఎలా ఉంటుందన్న దిశగా ఆ కళాశాల యాజమాన్యంతో బృందం చర్చించింది.

ఆలమూరు డిగ్రీ కళాశాల అమలాపురానికి తరలింపు

కొత్తగా ఏర్పడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు, కొత్తపేట, ఆలమూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. అయితే ఆలమూరు డిగ్రీ కళాశాలలో ఇటీవల కాలంలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో ఆ కళాశాలను అక్కడి నుంచి అవసరం ఉన్న అమలాపురానికి తరలించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలించి ఆ దిశగా చర్యలు చేపడుతోంది. దీంతో త్వరలోనే ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రద్దు చేసి దానిని అమలాపురం తరలించే ఏర్పాట్లను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అందుబాటులోకి వచ్చేలా ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అమలాపురంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల పై అంతస్తులో తొలుత డిగ్రీ కళాశాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై రాజమహేంద్రవరం డిగ్రీ కళాశాల పర్యవేక్షణ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కృష్ణను సంప్రదించగా అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ఆలమూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అమలాపురానికి తరలించే ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. ఆ ప్రతిపాదనలపై కసరత్తు జరుగుతోందని తెలిపారు.



డిగ్రీ కళాశాలగా మారనున్న అమలాపురంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల

ఔను.. ఆ వైద్యులు దేవుళ్లే

- కాకినాడ జీజీహెచ్‌లో అరుదైన ఘనత
- క్లిష్ట పరిస్థితిలో ఏకకాలంలో శస్త్ర చికిత్సలు
- గర్భిణితోపాటు శిశువును రక్షించిన డాక్టర్లు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ హేమలతాదేవి, వైద్య బృందం



ప్రాణాపాయం నుంచి బయటపడ్డ కుమార్తె, మనవడిని చూస్తూ మురిసిపోతున్న అశ్విని తండ్రి శ్రీను

కాకినాడ క్రైం: రోడ్డు ప్రమాదానికి గురై తలలో రక్తం గడ్డ కట్టి అత్యంత విషమంగా మారిన గర్భిణిని.. గర్భంలోని శిశువును కాకినాడ జీజీహెచ్ వైద్యులు బతికించిన వైనమిది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి సోమవారం ఈ సంఘటనకు సంబంధించి మీడియాకు వెల్లడించిన వివరాలివి. ఆలమూరు మండలం మూలస్థానానికి చెందిన 19 ఏళ్ల అశ్వినికి ఏడాది క్రితం ఎర్రంశెట్టి శివతో వివాహమైంది. గర్భం దాల్చడంతో అశ్విని పుట్టింటి వద్ద ఉంటోంది. గత నెల 23న తండ్రి శ్రీనుతో కలిసి ద్విచక్రవాహనంపై రాజమహేంద్రవరం ఆసుపత్రికి వెళ్లిన అశ్విని అదే వాహనంపై మందులు తీసుకొని వెనుదిరిగింది. ఈ క్రమంలో స్వగ్రామం శివారుకి చేరే సరికి త్రిపుల్ రైడింగ్‌లో వచ్చిన ఆకతాయిల వల్ల అశ్విని ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో అశ్విని తల డివైడర్‌ను ఢీకొంది. తల నుంచి తీవ్ర రక్తస్రావం అయింది. అశ్విని అపస్మారక స్థితికి చేరుకుంది. శ్రీను స్థానికుల సాయంతో హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యుల సిఫార్సు మేరకు అదే రోజు రాత్రి కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. ఆమె అప్పటికే కోమాలో ఉంది. వైద్యులు ఆగమేఘాలపై వైద్య పరీక్షలు పూర్తి చేసి ఎట్టకేలకు శస్త్ర చికిత్సకు సిద్ధం చేశారు.

ఏకకాలంలో రెండు శస్త్ర చికిత్సలు....

న్యూరో సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ విజయశేఖర్ పర్యవేక్షణలో గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ లావణ్యకుమారి, అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఒకేసారి బాధితురాలికి రెండు శస్త్రచికిత్సలు చేయాలని నిర్ణయించారు. తలలో గడ్డ కట్టిన రక్త ప్రవాహాన్ని పునరుద్ధరించడం, ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్న క్షతగాత్రురాలి గర్భంలోని బిడ్డను రక్షించడం వారి ముందున్న సవాలు. మూడు గంటల పాటు శ్రమించి సుదీర్ఘ శస్త్రచికిత్సలు నిర్వహించారు. సిజేరియన్ ద్వారా గర్భం నుంచి మగ బిడ్డను వేరు చేశారు. శిశువు ఆరోగ్య స్థితి ఆందోళనకరంగా ఉండటంతో తక్షణమే వెంటిలేటర్ అనుసంధానం చేసి కంటికి రెప్పలా కాపాడారు. అశ్విని ఆరోగ్య స్థితి అసాధారణంగా దిగజారుతుండడంతో వెంటిలేటర్ అనుసంధానం చేశారు. గతనెల 26వ తేదీ నుంచి తల్లీబిడ్డలు కోలుకోవడాన్ని వైద్యులు గుర్తించారు. సోమవారానికి పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు. కోమా స్థితిలో వచ్చిన అశ్విని పండంటి మగబిడ్డ ప్రసవించి నడుచుకుంటూ వాహనం వద్దకు బయల్దేరి వెళితే కుటుంబసభ్యులే నమ్మలేకపోయారు. బాధితురాలిది అరుదైన ఏబీ నెగెటివ్ గ్రూప్ కావడంతో శస్త్ర చికిత్స వేళ తీవ్ర ఒత్తిడికి గురయ్యామని న్యూరోసర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ ఎంవీ విజయశేఖర్ చెప్పారు. సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి రక్తం సకాలంలో అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. అరుదైన రెండు ఏకకాల శస్త్రచికిత్సల నిర్వహణలో హెచ్‌వోడీలు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ లావణ్యకుమారిల ఆధ్వర్యంలో న్యూరో సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కేవీవి.సత్యనారాయణ, గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ షీల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ, అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ పర్వీణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శశికిరణ్, పీజీ వైద్యులు డాక్టర్ కార్తీక్, డాక్టర్ అర్వింద్ కీలకంగా వ్యవహరించారని డాక్టర్ విజయశేఖర్ తెలిపారు. సమావేశంలో డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ అనిత సహా ఆసుపత్రి అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

లక్ష్మీనృసింహునికి బంగారు ఉద్ధరిణి సమర్పణ



అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణకు ఉద్ధరిణి ఇస్తున్న దాత భీమిరెడ్డి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం స్వామివారికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన పైపాడు వాస్తవ్యుడు భీమిరెడ్డి, కుటుంబ సభ్యులు కలసి 20 గ్రాముల బరువు గల బంగారు ఉద్ధరిణి సమర్పించారు. ఈ మేరకు ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు ఉద్ధరిణి ఇచ్చి, స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని వారు అందుకున్నారు. ఎంపీటీసీ సభ్యుడు బైర నాగరాజు, అర్చకులు పాల్గొన్నారు.

38 మందిపై న్యూసెన్స్ కేసుల నమోదు

డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: పోలీసు సబ్ డివిజన్‌లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కల్పిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న 38 మందిని ఆదివారం అదుపులోకి తీసుకుని వారిపై పబ్లిక్ న్యూసెన్స్ కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపారు. పుట్టిన రోజు లేదా పెళ్లి రోజు ఇలా ఏదో వినోద, విందు కార్యక్రమాల పేరుతో కొందరు సెంటర్లు, పబ్లిక్ రోడ్లపై కేకులు కట్ చేస్తూ హడావుడి చేస్తున్నారన్నారు. వీరి వల్ల ప్రజా జీవనానికి , ప్రజాశాంతికి వారు ఇబ్బంది కలిగిస్తున్నారని చెప్పారు. ఆదివారం డివిజన్‌లో తమ పోలీసు బృందాలు స్పెషల్ డ్రైవ్ చేసి అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 16 మందిని, అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో తొమ్మిది మందిని, ఉప్పలగుప్తం పోలీసు స్టేషన్ పరిధిలో ఆరుగురిని, ముమ్మిడివరం పోలీసు స్టేషన్ పరిధిలో ముగ్గురిని, ఐ.పోలవరం పరిధిలో ఇద్దరిని, కాట్రేనికోన పరిధిలో ఇద్దరి వంతున మొత్తం 38 మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామని డీఎస్పీ అంబికా ప్రసాద్ వివరించారు. ఇకపై ఈ డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని చెప్పారు.

రూ.70 కోట్లతో గోదావరి గట్టు అభివృద్ధి



ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్ మాదిరిగా రాజమహేంద్రవరం గోదావరి గట్టును వచ్చే సంవత్సరానికి సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేస్తామని ఎంపీ భరత్ రామ్ తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.70 కోట్లు మంజూరు చేసిందని, రానున్న పది రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. వారం, పది రోజుల్లో ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి, నగరవాసులు, ప్రముఖుల అభిప్రాయాల మేరకు గోదావరి గట్టును అభివృద్ధి చేస్తామన్నారు.

శ్రీ కృష్ణమందిర్ నిర్మాణానికి రూ.1,00,116 విరాళం



మందిర్ నిర్వాహకులు శ్రీనివాస ప్రభుకు చెక్కును అందజేస్తున్న దాత నాగేశ్వరరావు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు గ్రామంలో ఇంటర్నేషనల్ శ్రీకృష్ణ మందిర్ నిర్మాణానికి అమలాపురం వాస్తవ్యులు సప్పా నాగేశ్వరరావు సోమవారం రూ.1,00,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును సుందర శ్రీనివాస ప్రభుకు అందజేశారు. దాతను పలువురు అభినందించారు.

నరసన్న హుండీల రాబడి రూ.39.31 లక్షలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం అధికారులు నిర్వహించిన హుండీల లెక్కింపులో స్వామివారికి భక్తుల నుంచి మొత్తం రూ.39,31,511 ఆదాయం సమకూరింది. ఈ మేరకు 106 రోజులకు ఆలయంలో ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ జె.రామలింగేశ్వరరావు సమక్షంలో లెక్కింపు చేపట్టారు. ఇందులో మెయిన్ హుండీ, గుర్రాలక్క అమ్మవారి హుండీల ద్వారా రూ.38,53,550 ఆదాయం, అన్నదానం హుండీ ద్వారా రూ.77,961 ఆదాయం వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. నాలుగు గ్రాముల బంగారు క్వాయిన్, కొంత విదేశీ కరెన్సీ వచ్చినట్టు ఆయన చెప్పారు.

జేసీ ధ్యానచంద్ర బదిలీ



సాక్షి అమలాపురం: బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర హెచ్.ఎం. బదిలీ అయ్యారు. ఈ మేరకు సీఎస్ కె.ఎస్.జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వులలో పేర్కొన్నారు. కొత్త జేసీ వచ్చేవరకు ఆ బాధ్యతను జిల్లా కలెక్టర్ శుక్లాను నిర్వహించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజన తరువాత ఏర్పడిన కోనసీమ జిల్లాకు ఆయన తొలి జేసీగా వచ్చారు. సుమారు 14 నెలల పాటు ఆయన ఇక్కడ జేసీగా పనిచేశారు. ఖరీఫ్, రబీ ధాన్యం కొనుగోలు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతుల మన్ననలందుకున్నారు. గత నెలలోనే ఆయనకు బదిలీ అవుతోందనే ఊహాగానాలు వినిపించినా బదిలీ జరగలేదు. కొనసాగుతారనుకున్న సమయంలో బదిలీ జరగడం విశేషం.

బాలాత్రిపుర సుందరి అమ్మవారికి సారె



అమ్మవారికి సారె తీసుకొస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ గీత, ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి దేవదాయశాఖ ఈ ఏడాది కొత్తగా ఆషాఢం సారె సమర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లాలో తొలిసారిగా కాకినాడ బాలాత్రిపుర సుందరి అమ్మవారికి 125 రకాలతో సారె సమర్పించారు. ఇందులో అనేక రకాల స్వీట్లు, పండ్లు ఉన్నాయి. కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ వంగా గీత, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, మహాలక్ష్మి దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలతో పాటు ఈ సారె అందజేశారు. ఇదిలా ఉంటే ఐదు టన్నుల కూరగాయలతో అమ్మవారిని శాకంబరిగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పెద్ది రత్నాజీ పాల్గొన్నారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది

అన్నవరం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. సత్యదేవుని దర్శించిన భక్తులకు దర్బారు మండపంలో కదంబం ప్రసాదంతో పాటు ఆదివారం మహాలక్ష్మి అమ్మవారికి అలంకరించిన గాజులను పంపిణీ చేశారు. సత్యదేవుని సన్నిధిలో వ్యాసపూర్ణిమ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. దర్బారు మండపంలో వ్యాస మహర్షికి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. వ్యాసమహర్షి చిత్రపటంతో ఆలయ ప్రాంగణంలో మూడు సార్లు ప్రదక్షిణ చేశారు. అనంతరం నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

పేదలందరికీ కలల సౌధాలు

పిఠాపురం: పేదలందరికీ సకల సౌకర్యాలతో కలల సౌధాలు నిర్మిస్తున్నామని, ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇప్పటి వరకూ 70 వేల మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అందించామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. సోమవారం పిఠాపురంలోని గోర్స రైల్వే గేటు వద్ద వైఎస్సార్ జగనన్న నగర్‌లో నిర్మించిన 864 టిడ్కో గృహాల పంపిణీ, ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టిడ్కో గృహ సముదాయాలను అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ అత్యంత పారదర్శక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. అర్హుల సొంతింటి కలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ఆగస్టు మొదటి వారానికి రాష్ట్రంలోని లబ్ధిదారులకు అందించే టిడ్కో గృహాల సంఖ్య లక్ష దాటుతుందని వివరించారు. టిడ్కో గృహాల సముదాయాలు రానున్న రోజుల్లో టౌన్‌షిప్‌లుగా మారబోతున్నాయని, వాటిలో కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు వంటి సకల సౌకర్యాలు ఏర్పాటవుతాయన్నారు. మంచి వాతావరణంలో పిల్లాపాపలతో హాయిగా గడిపేందుకు వీలుగా ఈ గృహాలను ప్రభుత్వం నిర్మించిందని ఆయన తెలిపారు. తాగునీరు, విద్యుత్, డ్రైన్లు వంటి అన్ని సదుపాయాలు కల్పించి రిజిస్ట్రేషన్లు సైతం ఉచితంగా చేయించి లబ్ధిదారులకు అందజేయడానికి ప్రభుత్వం రూ.20 వేల కోట్లు వెచ్చించిందన్నారు. ఈ గృహ సముదాయాల్లో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు ఏర్పాటు కానున్నాయని మంత్రి తెలిపారు.

విషం జిమ్ముతున్న ఎల్లో మీడియా

ప్రభుత్వం చిత్తశుద్ధితో టిడ్కో గృహాలను అధునాతన సదుపాయాలతో తీర్చిదిద్దుతుంటే ఈనాడు, ఆంధ్రజ్యోతి పేపర్లు విషం జిమ్ముతున్నాయని మంత్రి ఆదిమూలపు దుయ్యబట్టారు. 2019 నాటికి 50 శాతం మాత్రమే పనులు పూర్తవ్వగా ప్రస్తుత ప్రభుత్వం టిడ్కో గృహాలను నివాసయోగ్యంగా తయారు చేసిందన్నారు. అంతేకాకుండా రిజిస్ట్రేషన్లు చేసి లబ్ధిదారులకు అప్పగిస్తుందన్నారు. కాకినాడ ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఎండీ చిత్తూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాటన్ బ్యారేజీ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ 12వ నంబర్ గేట్ వద్ద సోమవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం నీటిలో తేలింది. మృతుడి వయసు సుమారు 30 సంవత్సరాలు ఉంటుందని ధవళేశ్వరం పోలీసులు వెల్లడించారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ధవళేశ్వరం పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కె.మంగాదేవి సూచించారు.

సాగునీటి ఎద్దడి లేకుండా అదనపు జలాలు

మంత్రి చెల్లుబోయిన వేణు

రామచంద్రపురం: తొలకరి సమీపించినా వర్షాలు పడకపోవడంతో రైతులకు అదనపు జలాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఈఈ వి.వి.రామకృష్ణ, డ్రైనేజీ డీఈ ఆర్.నాగేంద్ర కుమార్, ఏఈలు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల, వ్యవసాయాధికారులతో సాగునీటి ఎద్దడి గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రస్తుతం విడుదలవుతున్న సాగునీటికి అదనంగా 30 శాతం నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ ఈఎన్‌సీ నారాయణరెడ్డితో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. దీనికి ఆయన సమ్మతించి నీటిని విడుదల చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. తొలకరి పనులకు ఆటంకం లేకుండా ధవళేశ్వరంలో నీటి విడుదల శాతాన్ని పెంచారని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి వేణుగోపాలకృష్ణ తెలిపారు.

బాలుడిని బలిగొన్న ఆర్టీసీ బస్సు



సంఘటనా స్థలంలో బంధువుల రోదనలు



బాధిత కుటుంబ సభ్యులతో చర్చిస్తున్న ఎంపీ భరత్‌రామ్, రూరల్ కో-ఆర్డినేటర్ నాగేశ్వర్

- అతి వేగమే అనర్థానికి కారణం
- కట్టలు తెంచుకున్న గ్రామస్తుల ఆగ్రహం
- బస్సు ధ్వంసం..డ్రైవర్‌కు దేహశుద్ధి
- రూ.10 లక్షల సాయాన్ని అందజేసిన ఎంపీ భరత్‌రామ్, రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్



గుంజే ఈశ్వర్‌దుర్గ (ఫైల్)



గాయాలపాలైన ఆర్టీసీ బస్సు డ్రైవర్



స్థానికుల దాడితో ధ్వంసమైన ఆర్టీసీ బస్సు

ధవళేశ్వరం: అతి వేగం కారణంగా ఏడేళ్ల బాలుడు అసువులు బాశాడు. అప్పటి వరకు ఇంట్లో సందడి చేసిన తమ బిడ్డ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం రోదన వర్ణనాతీతంగా మారింది. ఆర్టీసీ డ్రైవర్ అతి వేగంగా వచ్చి టిఫిన్ కోసం బైక్‌పై వెళుతున్న తండ్రి కొడుకులను ఢీకొట్టడంతో స్థానిక ప్రైవేట్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న గుంజే ఈశ్వర్‌దుర్గ (7) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కళ్లెదుటే అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఏకైక కుమారుడు మృతి చెందడంతో తండ్రి బోయేసు రోదన అక్కడ ఉన్నవారిని కంట తడి పెట్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి..

స్థానిక వడ్డెర కాలనీకి చెందిన గుంజే బోయేసు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బోయేసుకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం ఉదయం వడ్డెర కాలనీ సమీపంలోని హోటల్ నుంచి టిఫిన్ తీసుకువచ్చేందుకు బైక్‌పై కుమారుడు ఈశ్వర్ దుర్గతో కలిసి రోడ్డుపైకి వచ్చాడు. వెనుక నుంచి ఆర్టీసీ బస్సు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బోయేసు రోడ్డు అవతల పక్క పడగా బాలుడు ఈశ్వర్ దుర్గ టైర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కోపోద్రిక్తులైన స్థానికులు ఆర్టీసీ డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం బస్సును ధ్వంసం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ స్థానికులు ఆందోళనకు దిగారు. తీవ్రగాయాలైన ఆర్టీసీ డ్రైవర్‌ను పోలీసులు భారీ బందోబస్తు నడుమ 108వాహనంలో అక్కడి నుంచి తరలించారు. డ్రైవర్ తరలింపునకు కూడా స్థానికులు అడ్డు తగిలారు. 108 వాహనం అద్దాలను ధ్వంసం చేశారు. న్యాయం జరిగే వారకు బాలుడి మృతదేహాన్ని తరలించడానికి వీలు లేదని స్థానికులు ఆందోళన చేపట్టారు. రోడ్డుపైనే టెంట్ వేసుకొని ఆందోళనకు దిగారు. దీంతో పలుసార్లు పోలీస్, రెవెన్యూ, ఆర్టీసీ అధికారులు స్థానికులతో చర్చించారు. అయినప్పటికీ స్థానికులు శాంతించలేదు. విషయం తెలుసుకున్న రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ,మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్ బాధితులతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని ప్రభుత్వ పరంగా సాయం అందిస్తామని ఎంపీ భరత్‌రామ్, కో-ఆర్డినేటర్‌నాగేశ్వర్ హామీ ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ చేతుల మీదుగా రూ.10 లక్షల చెక్కును అందజేశారు.

మధ్యాహ్నం వరకు తీవ్ర ఉద్రిక్తత

బాలుడి మృతితో ధవళేశ్వరం ప్రధాన రహదారిపై తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రధాన రహదారిపై స్థానికులు ఆందోళన చేపట్టడంతో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. రాజమహేంద్రవరం నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ఐఎల్‌టీడీ నుంచి బొమ్మూరు వైపునకు, ధవళేశ్వరం వైపు వచ్చే ట్రాఫిక్‌ను వేమగిరి నుంచి బొమ్మూరు వైపు మళ్లించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రజనీ, రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ శ్రీనివాసులు, ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి, కడియం సీఐ తిలక్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

అంబాజీపేట: అతివేగంగా, అజాగ్రత్తగా ఆటో నడుపుతూ ఓ మహిళను ఢీ కొట్టగా కాకినాడ ఆస్పత్రిలో చికిత పొందుతూ సోమవారం ఆమె మృతి చెందింది. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇరుసుమండకు చెందిన కుడుపూడి వెంకటలక్ష్మి (45) గత నెల 30వ తేదీ రాత్రి టిఫిన్ తెచ్చుకునేందుకు పుల్లేటికుర్రు వెళ్లింది. ఈ సమయంలో రోడ్డు దాటుతున్న వెంకటలక్ష్మిని అంబాజీపేట నుంచి ముక్కామల వైపు వెళుతున్న ఆటో వెనుక నుంచి బలంగా ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రురాలిని 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించగా అదే రోజు మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటలక్ష్మి మృతి చెందిందన్నారు. మృతురాలి మేనల్లుడు చొల్లంగి సాయిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పి.భగవాన్‌నారాయణ తెలిపారు.

టెన్త్ ఫెయిలైన విద్యార్థులు స్కూల్లో చదివే అవకాశం

పునఃప్రవేశ కార్యక్రమం ప్రారంభించిన ఆర్‌జేడీ నాగమణి



జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థికి అందజేస్తున్న ఆర్‌జేడీ నాగమణి

కాకినాడ రూరల్: పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ ఏడాది పదో తరగతి చదివేందుకు రాష్ట్ర విద్యాశాఖ అవకాశం కల్పించిందని ఆర్జేడీ జి.నాగమణి అన్నారు. సోమవారం సర్పవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పునః ప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడారు. విద్యార్థుల భవిత దృష్ట్యా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. పదో తరగతి చదివేందుకు తిరిగి పాఠశాలలో చదివే విద్యార్థులకు రెగ్యులర్ విద్యార్థులకు చెందే సంక్షేమ పథకాలు జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి వస్తుందన్నారు. ఇంటి దగ్గర చదవాలని ఉన్నా వారు చదివే పరిస్థితి ఉండకపోగా కాలం వృథా చేస్తారన్న ఉద్దేశంతో పాఠశాల వాతావరణమే వారి భవిష్యత్తుకు మేలు జరుగుతోందని పునః ప్రవేశ కార్యక్రమాన్ని రాష్ట్ర విద్యాశాఖ ప్రారంభించిందన్నారు. గతంలో ఇప్పటి వరకు ఇలాంటి వెసులుబాటు విధానం లేదని, ఈ ఏడాదే ప్రవేశ పెట్టినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పదిమంది విద్యార్థులను పాఠశాలకు ఉపాధ్యాయులు రప్పించగా వారితో ఆర్జేడీ నాగమణి మాట్లాడి మోటివేట్ చేయగా ఐదుగురు పాఠశాలలో చేరడానికి సిద్ధమవగా వారికి జగనన్న విద్యా కానుకలను అందజేశారు. విద్యాకమిటీ కోఆప్టెడ్ సభ్యులు ఎల్.ఎస్.వీరభద్రరాజు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. డీవైఈఓ రాజు, ప్రధానోపాధ్యాయులు డి.సత్యనారాయణరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకేలో తత్కాల్ ఓడీ సౌకర్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ అనుబంధ కళాశాల విద్యార్థులకు తత్కాల్ ఓడీ(ఒరిజనల్ డిగ్రీ) సదుపాయం కల్పించినట్లు వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఇప్పటివరకూ తత్కాల్ విధానంలో పీసీ (ప్రొవిజనల్ మార్కుల జాబితా) మాత్రమే ఇచ్చేవారమన్నారు. విద్యార్థుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఒరిజనల్ డిగ్రీ ఒక్కరోజులోనే అందజేస్తున్నామన్నారు. ఉద్యోగాలు పొందినవారు లేదా విదేశాల్లో ఉన్నత విద్యకు వెళ్లేవారికి ఇదెంతో ఉపయోగకరమన్నారు. వర్సిటీకు అనుబంధంగా ఉన్న పాత ఉమ్మడి ఎనిమిది జిల్లాలలోని ఇంజినీరింగ్, ఫార్మా, మేనేజ్‌మెంట్ కళాశాలల్లో కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు ఈ సౌకర్యం వినియోగించుకోవాలని సూచించారు.

పదోన్నతుల కోలాహలం

- 59 స్థానాల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా ఎస్‌ఏలకు అవకాశం
- డీఈవో వెబ్‌సైట్‌లో సీనియార్టీ జాబితాలు
- నేడు గ్రేడ్-2 హెచ్‌ఎం, రేపు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు కౌన్సెలింగ్

రాయవరం, బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇప్పుడు విద్యాశాఖలో పదోన్నతుల కోలాహలం కొనసాగుతోంది. కొద్దిరోజుల క్రితం ఎంఈవో-2లను నియమించిన ప్రభుత్వం, ఆదివారం ఎంఈవో-1 పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న 27 ఎంఈవో-1 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించగా, 20 పోస్టులు భర్తీ అయ్యాయి. ఎంఈవో-2 పోస్టుల భర్తీ సందర్భంగా ఖాళీ ఏర్పడిన గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించేందుకు వీలుగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించి, జిల్లా వ్యాప్తంగా ఖాళీలను వెల్లడించడంతో పాటు సీనియారిటీ జాబితాలను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పోస్టులు 59 వరకు ఖాళీలున్నాయి. ఈ ఖాళీలను అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల ద్వారా భర్తీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేస్తోంది. మంగళవారం మధ్యాహ్నం గ్రేడ్-2 హెచ్‌ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న వారితోనే భర్తీ చేసేలా నిర్ణయించారు. అలాగే గ్రేడ్-2 పదోన్నతులు, పీజీటీ పదోన్నతుల ద్వారా ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి కూడా చర్యలు తీసుకుంటున్నారు. వివిధ సబ్జెక్టుల్లో ఏర్పడిన ఖాళీలను అర్హులైన జిల్లా పరిషత్ యాజమాన్యంలో విధులు నిర్వర్తిస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతో భర్తీ చేయనున్నారు.

అడహక్ కమిటీ ప్రాతిపదికన

స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించడానికి విద్యాశాఖ ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. ఈ పదోన్నతులు అడహక్ కమిటీ సూచించిన మార్గదర్శకాల ప్రకారం చేపడతారు. ఇప్పటికే గ్రేడ్-2 హెచ్‌ఎం సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలను పరిష్కరించి డీఈవో వెబ్‌సైట్‌లో ఉంచారు. గ్రేడ్-2 హెచ్‌ఎంల పదోన్నతుల అనంతరం ఏర్పడిన ఖాళీలతో పాటు, జీవో 117 ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల రోల్‌కు అనుగుణంగా ఎక్కడ ఏ సబ్జెక్టు ఉపాధ్యాయుడు అవసరమో గుర్తిస్తారు. జిల్లా వ్యాప్తంగా, సబ్జెక్టుల వారీగా ఎన్ని స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయో నిర్ధారించుకున్న అనంతరం ఎస్‌ఏ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 5న స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది.

మార్గదర్శకాలను అనుసరిస్తూ..



విద్యాశాఖ రూపొందించిన మార్గదర్శకాలను అనుసరించి ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతులు చేపడుతున్నాం. పూర్తి పారదర్శకంగా పదోన్నతుల ప్రక్రియను చేపడుతున్నాం.

– కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, నోడల్ అధికారిణి, డీఈవో, కాకినాడ జిల్లా

ఈసెట్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులకు స్టేట్‌ర్యాంకు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు ఈసెట్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకు సాధించినట్టు కళాశాలల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఏపీ ఈసెట్ 2023 పరీక్షా ఫలితాల్లో స్టేట్‌లో 5,6,8,8,10 ర్యాంకుతో పాటుగా వందలోపు 39 ర్యాంకులను సాధించినట్టు పేర్కొన్నారు.

స్టేట్ ర్యాంకులో కె. రామ్‌తేజ 5, డి.మహేశ్వరి 6, పి.రమేష్ 8, వీఎల్‌వీఎస్ చరణ్ 8, డి.రమ్యశ్రీ 10 ర్యాంకులు సాధించి రాష్ట్రస్థాయి టాప్ పదిలో 5 ర్యాంకులను కైవసం చేసుకున్నట్టు తెలియజేశారు. వీటితోపాటు 100లోపు మొత్తం 39 ర్యాంకులను తమ కళాశాలల విద్యార్థులు సొంతం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాలల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్‌టీవీఎస్ కుమార్, డీన్ ఏవీ మాధవరావు, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

శాకంబరీ నమోస్తుతే



కనకదుర్గమ్మ



వనదుర్గ అమ్మవారు



మహాలక్ష్మీ

అన్నవరం: రత్నగిరిపై కొలువైన సత్యదేవుని సన్నిధిన ఆషాఢ పౌర్ణమి పర్వదినం సందర్భంగా సోమవారం దర్బారు మంటపంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారు, రత్నగిరి దుర్గామాతలు 'శాకంబరి' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. తొలి ఏకాదశి పర్వదినం నుంచి రత్నగిరి దర్బారు మంటపంలో సర్వాలంకార భూషితుడైన విష్ణుమూర్తి భక్తులకు దర్శనమిస్తున్న సంగతి విదితమే. గత శనివారం నుంచి మహాలక్ష్మి అమ్మవారిని కూడా తొలి రోజు పుష్పాల తో, ఆదివారం గాజుల అలంకరణలో, సోమవారం కాయగూరలు, ఆకు కూరలతో అలంకరించారు.

శాకంబరి అవతారంలో రత్నగిరి దుర్గామాతలు

నిత్యం స్వర్ణాభరణాలతో, పట్టు వస్త్రాలు ధరించి సర్వాంగ సుందరంగా భక్తులకు దర్శనమిచ్చే రత్నగిరి దుర్గామాతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను, గ్రామదేవత నేరేళ్లమ్మను ఆషాఢ పౌర్ణమి పర్వదినం సందర్భంగా సోమవారం ఆకు కూరలే వస్త్రాలుగా, కాయగూరలే ఆభరణాలుగా వివిధ రకాల పండ్లతో రూపొందించిన మాలలే హారాలుగా అలంకరించారు. అమ్మవార్లతో బాటు ఆలయాలను కూడా ఆకుకూరలు, కాయగూరలతో అందంగా అలంకరించారు. ఉదయం ఆరు గంటల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులు అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా కదంబం ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు అక్షయ



రితిక అక్షయ

ఆలమూరు: మండలంలోని జొన్నాడకు చెందిన చిప్పాడా పోషణ రితిక అక్షయ జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల విజయనగరంలో రాష్ట్ర స్థాయిలో అండర్ 7 విభాగంలో నిర్వహించిన చెస్ పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభను కనబర్చి ద్వితీయ స్థానం సాధించింది. రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.మస్తాన్ బాబు, కోశాధికారి కె.వి. జ్వాలాముఖి నుంచి బహుమతులను, ప్రశంసాపత్రాన్ని అందుకుంది. పశ్చిమ బంగలో సెప్టెంబర్ 20 నుంచి 25 వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున అక్షయ ప్రాతినిధ్యం వహించనుందని తల్లిదండ్రులు మూర్తి, తులసి తెలిపారు.

పిడుగు పడి వ్యక్తి మృతి



మద్దూరి కిట్టయ్య మృతదేహం

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలిలో సోమవారం పిడుగు పడిన ఘటనలో మద్దూరి కిట్టయ్య (60) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం వర్షాల దృష్ట్యా గోదావరి లంకలోని తన పశువుల మకాంలో గేదెలను కట్టేందుకు వెళుతుండగా అకస్మాత్తుగా పిడుగు పడింది. శరీరంపై తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పిడుగుపడి మృతి చెందడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉసురు తీసిన ఉపాధి

దుబాయిలో ముమ్మిడివరం వాసి మృతి



కిరణ్‌కుమార్ మృతదేహం

ముమ్మిడివరం: ఏజెంటు చేతిలో మోసపోయి దుబాయ్‌లో చిక్కుకున్న ఒక యువకుడు తీవ్ర ఆవేదనకు గురై అక్కడే గుండెపోటుతో మృతిచెందాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ జీఎంసీ బాలయోగి కాలనీకి చెందిన జొన్నాడ కిరణ్‌కుమార్ (38) ఇక్కడ ఆటో నడుపుకుంటూ జీవనోపాధి పొందేవాడు. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆటో నడపడం వల్ల కుటుంబాన్ని నెట్టుకు రావడం కష్టంగా ఉండటంతో నాలుగు రాళ్లు సంపాదించాలనే ఆశతో బతుకు తెరువుకోసం దుబాయ్ వెళ్లేందుకు ఒక ఏజెంట్‌ను ఆశ్రయించాడు. తీరా కిరణ్‌కుమార్ అక్కడికి వెళ్లాక టూరిస్టు వీసాపై ఏజెంట్ పంపినట్లు తెలుసుకున్నాడు. అక్కడ పని దొరక్క దిక్కూ మొక్కూ లేక ఏజెంటు చేతిలో మోసపోయానని తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఆరు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడి చివరకు గుండెపోటుకు గురై 16 రోజుల క్రితం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. అతని మృతదేహం ఇక్కడకు తీసుకువచ్చే దారి లేకపోవడంతో కుటుంబ సభ్యులు మంత్రి పినిపే విశ్వరూప్‌ను ఆశ్రయించారు. మంత్రి విశ్వరూప్ దుబాయ్‌లో ఉన్న మోకా రాజుకు విషయం చెప్పి కిరణ్‌కుమార్ మృతదేహాన్ని ఇండియాకు పంపే ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో దుబాయ్‌లో ఉన్న రాజు తన స్నేహితుడు ఓగూరి శ్రీనివాస్ సహకారంతో ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్, (ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెన్సీ తెలుగు సొసైటీ) స్వచ్ఛంద సంస్థను ఆశ్రయించారు. ఆ సంస్థ ప్రతినిధులైన నరసింహం, సామిరెడ్డిల సహకారంతో అక్కడి ప్రభుత్వాన్ని సంప్రదించి సోమవారం మృతదేహాన్ని అక్కడి నుంచి విమానం ద్వారా హైదరాబాద్‌కు అక్కడ నుంచి అంబులెన్స్‌లో స్వగ్రామానికి ఉచితంగా పంపించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చేందుకు కృషి చేసిన సొసైటీ ప్రతినిధులు నరసింహం, సామిరెడ్డి, ఓగూరి శ్రీనివాస్‌లను కిరణ్ కుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.